

# పాలపుంత

కాని మరొక పదిహేను రోజుల తరవాత రాఘవయ్య మనసులోని ఊహకి విరుద్ధంగా జరిగింది. ఆవేళ అతను ఇంట్లో ఉండగా, పంతులుగారికి, అతనికి తెలిసిన ఒక పెద్దమనిషి, వచ్చి "ఇక పంతులుగారి కుటుంబానికి కష్టాలు తీరిపోయినట్టే నండి" అన్నాడు.

"ఏం?" అన్నాడు రాఘవయ్య కుతూహలంగా.

"వాళ్ల పెద్దమ్మాయికి సంబంధం కుదిరి పోయిందిగా. అలా ఇలాంటి సంబంధమనుకున్నారేమిటి? లక్షాధికారి సంబంధం. వచ్చేనెల్లోనే పెళ్లి" అన్నాడు అతను. ఇది విన్న రాఘవయ్యకు మతి పోయినంత పని అయింది. ఆ తరవాత రాఘవయ్య పంతులుగారి భార్యనడిగి చాలా విషయాలు తెలుసుకున్నాడు. పంతులు గారి అమ్మాయి, పెళ్లికొడుకూ అంతకుముందే ప్రేమించుకున్నారట. పెళ్లికొడుకు తండ్రిలేడుట. ఆస్తి అంతటికీ అతనే వారసుడుట. తల్లి అతనిమాట కాదనుదుట. అతను పంతులు గారమ్మాయిని పెళ్లి చేసుకోవడమేకాదు, మిగతావాళ్లనంతా, అతనే పోషిస్తాడుట. వాళ్లకి పెళ్లిళ్లూ, అవీ, అతనే చూస్తాడుట. అసలు ఈ షరతులమీదే, పంతులుగారమ్మాయి, అతన్ని పెళ్లిచేసుకోడానికి ఒప్పుకుందిట.

రాఘవయ్య ఆరోజు, సంతోషమో, విచారమో

తెలియని స్థితిలో ఇంటికి వచ్చిపడ్డాడు. అతని మన సులో ఏదో వెలితి ఏర్పడ్డట్టయింది. 'పంతులుగారిదే మదృష్టం? చచ్చిపోయినా, ఆయన కుటుంబం రాజ బాటలో పడ్డారు. తనూ ఉన్నాడు ఎందుకు?' రాఘవయ్యకు, ఎందుకో తను ఒంటరివాడయినట్టు, అనిపించసాగింది. తనచుట్టూ ఉన్న దారిద్ర్యం, మరింత భయంకరంగా కనిపించడం మొదలుపెట్టింది. ఆతనికొక సందేహం కలిగింది అప్పుడు. 'ఒకవేళ పంతులుగారే బతికి ఉంటే ఆ పెళ్లికొడుకు వచ్చేవాడేనా?' అని. ఒకవేళ వీళ్ల కష్టాలు చూసి జాలిపడి చేసుకుంటున్నాడేమో! అయితే తను లేకపోతే, అలా, తన కుటుంబాన్ని ఎవడైనా ఆదుకుంటాడా? అప్పుడే, అతనికి మొదటి సారిగా సందేహం కలిగింది. 'తాను చచ్చిపోతే ఏం జరుగుతుంది?' అని.

రాఘవయ్య మనసులో మెదిలిన ఊహ, అతన్ని చెదపురుగులా తొలిచెయ్యడం ప్రారంభించింది. 'తను ఉండగా ఈ కుటుంబం బాగుపడడంకల్ల. బాగుచెయ్యడం తన శక్తికి మించినపని. కాని, తర తరవాత ఎవరైనా తన కుటుంబాన్ని ఉద్ధరిస్తారని నమ్మకమేమిటి? ఒకవేళ ఆలా ఉద్ధరించకపోతే, వాళ్లంతా అడుక్కుతినాలి! ఈ ఆలోచనలతో, అతనికి ముందున్న మనస్థిమితం కూడా పోయింది. దానికితోడు, ఇంట్లో పరిస్థితులు అందుకు దోహదం చేశాయి. తల్లి అనారోగ్యం ఇటీవల మరీ ఎక్కువయింది. ఇప్పుడావిడికి అన్నీ మంచంమీదే చెయ్యవలసి వస్తోంది. ఇల్లు అసలే చిన్నది కావడం వల్ల, ఎవరికీ సుఖంలేకుండా ఉంది. దానికితోడు పెళ్లీడుకి వచ్చిన పెద్దమ్మాయి ఒక పెద్ద సమస్య అయి కూర్చుంది. ఇంతవరకూ తనకిది కావాలని ఏనాడూ నోరు విప్పి అడగని జానకమ్మ, ఇప్పుడు పెళ్లి సంబంధాలు వెతకాలని, రాఘవయ్యకు సమయం దొరికినప్పుడల్లా జ్ఞాపకం చెయ్యసాగింది. అలా జ్ఞాపకం చేసినప్పుడల్లా రాఘవయ్య మండిపడేవాడు.

"ఏం చూసుకుని వెతకమన్నావు? కొంపా? గోడా? డబ్బా? దస్కమా? నా ప్రాణం నువ్వు కూడా పీక్కు తింటే గాని నీకు సుఖం ఉండదా?" అని.

అలా అన్నప్పుడు జానకమ్మ కళ్లనీళ్లు పెట్టుకునేది. తన ప్రాణానికన్నా మిన్నగా ఒకప్పుడు చూసుకున్న భార్యని అలా తిట్టానే అని జ్ఞాపకం వచ్చి, ఆ తరవాత రాఘవయ్య మరింత మనశ్శాంతి లేకుండా అయ్యేవాడు. ఈ చికాకులూ, ఇంటి పరిస్థితులూ, అన్నీ కలసి, అతన్ని మానసికంగా కుంగదీయడమేకాకుండా, శారీరకంగా కూడా దెబ్బతీశాయి. అతనికి అనారోగ్యం దాపరించింది. ఆ అనారోగ్యం, వివరీతమైన దగ్గులోకి దింపింది. అది రానురాను తీవ్రమై, రాత్రిపూట అసలు నిద్రలేకుండాచేసింది. అతని దగ్గుమూలంగా ఇంట్లోకూడా ఎవ్వరికీ నిద్రలేకుండాపోయింది. అందుకని నిద్రపట్టని పిల్లలు విసుక్కునేవారు. తల్లి విసుక్కోలేక, ఏవేవో సలహాలు ఇచ్చేది. "కాసిని మంచినీళ్లు తాగరాదుట్రా? అయినా అలా పొద్దస్తమానమూ తిరక్కపోతే కాస్త విశ్రాంతి తీసుకోకూడదూ? ఏదైనా మందో, మాకో అయినా పుచ్చుకో"

ఈ సలహాలు విన్నప్పుడల్లా రాఘవయ్యకు కళ్ల నీళ్లు తిరిగేవి. మంచినీళ్లు తాగితే పోయే దగ్గుకాదని ఆవిడికు తెలుసు. మందో మాకో పుచ్చుకొనే శక్తిలేదని తెలుసు. అయినా ఏదో ఒకటి అనాలి కదా అని అనేది. విసుక్కోకుండా. ఒక్క జానకమ్మే అతనికి పరిచర్యలు చేసేది. 'ఆమె కూడా విసుక్కోడం మొదలెడితే తన గతేం కాను?' అని రాఘవయ్యకు భయంపట్టుకుంది. ఈ బాధలన్నిటివల్లా తను చచ్చిపోతే ఏం జరుగుతుంది అనే ఆలోచన పోయి, రాఘవయ్యలో తను చచ్చిపోవడం మంచిదనే నిర్ణయం బలపడసాగింది.

అన్ని బాధల్లోనూ, ఇంకా ఒక ఆశమాత్రం రాఘవయ్యకు విడిచిపోలేదు. అది, పంతులుగారి కుటుంబం దారిద్ర్యం, ఆయన పెద్దకూతురివల్ల తీరినట్టు, తన కుటుంబం దారిద్ర్యం తన పెద్దకూతురి వల్ల తీరవచ్చేమో అని. అందుకు ఏమైనా ఆస్కార ముంటేమోనని ఆయన కూతురి వైఖరిని కనిపెట్టసాగాడు. కాని అతని కూతురు ఎవరినీ ప్రేమిస్తున్నట్టుగాని, పెళ్లిచేసుకో దల్చుకున్నట్టుగాని అతనికి కనబడలేదు. ఆ అమ్మాయి, తల్లిలాగానే, ఇంట్లోనే నిశ్శబ్దంగా ఒక మూల కూర్చుని, ఏదో పని చేసుకుంటూ ఉండేది. కొన్ని రోజుల తరవాత రాఘవయ్యలో ఆ ఆశ కాస్తా అంతరించిపోయింది. ఆయనకు మరింత బాధ కలిగింది. ఎవరైనా, బాగా డబ్బున్న యువకుడు తన కూతురిని కట్నంలేకుండా పెళ్లాడతానని వస్తాడేమోనని ఆయన చాలా రోజులు ఎదురుచూశాడు. కాని ఎవరూ వచ్చేటట్టు సూచనలైనా కనిపించలేదు. 'తను పోయిన తరవాత, ఆ మాటకి వస్తే, తను బతికి ఉండగానే, ఈ సంసారం మునిగిపోయేదెలా అని ఆయనకు మనోవ్యథ ప్రబలమై పోసాగింది. ఆ తరవాత, పట్టుకున్న దగ్గు విషమస్థితిలోకి దింపే సరికి ఆయనకు డాక్టర్ని చూడక తప్పలేదు. డాక్టరు రాఘవయ్యను పరీక్షించి క్షయ అని నిర్ధారించేడు. చేయి దాటిందని చెప్పకపోయినా, కొంచెం ఆలస్యంచేశారనిమాత్రం చెప్పాడు. ఇక ఉద్యోగం మానుకుని విశ్రాంతి తీసుకోకపోతే ప్రాణానికే ముప్పు అని హెచ్చరించాడు. ప్రాణాంతకమైన డాక్టరు సలహాకి ఫీజు ఇరవయి రూపాయలు చెల్లించుకుని బయటపడ్డాడు రాఘవయ్య.

ఆ తరవాత అతనికి ఒకే ప్రశ్న ఎదురయింది. తనే మంచానపడిఉంటే, తనతల్లి, పిల్లలూ, భార్యా, వాళ్ల సంగతి చూసేదెవరు? ఇల్లు గడవడం ఎలా? లాభం లేదు. డాక్టరు ఎంత చెప్పినా, తను ఉద్యోగం మానడం కష్టం. రాఘవయ్య మొండికేసి ఆఫీసుకు వెళ్లడం సాగించాడు. కాని అదెన్నాళ్ళో సాగలేదు. ఒక రోజు మెయిను రోడ్డుమీద కళ్లు తిరిగి పడిపోయిన రాఘవయ్యను, ఆ చుట్టు పక్కల వాళ్లు ఇంటికి మోసుకు వచ్చారు. తల్లీ పిల్లలూ, గొల్లుమన్నారు. జానకమ్మ కలవరపడింది.

రాఘవయ్య కూడా మంచంమీదికి చేరవలసివచ్చింది.



తల్లి మంచం పక్కనే అతని మంచం. రోజంతా మౌనమూ, ఏవీూతోచని, చాదస్తపు తల్లి మాటలతో, అతనికి మరింత విరక్తి కలుగుతూంది.

"అయినా సంపాదించుకున్నప్పుడు కన్నూ, మిన్నూ కానకుండా ఖర్చుపెట్టుకుంటే, ఏ సంసారాలు నిలుస్తాయి? నేను అప్పుడే చెప్పాను. కొంచెం డబ్బు వెనకెయ్యరా, అని వింటేనా? ఇప్పుడు చూడు! నువ్వేమో మూలబడ్డావు. ఇక ఈ సంసారాన్ని ఈడిచే దెవరు? రామయ్య తండ్రీ! ఏం చెయ్యాలో నువ్వే చెప్పు!" రాఘవయ్య తల్లి సగం అతన్ని, సగం దేవుణ్ణి ఉద్దేశించి మాట్లాడేది.


"నిజం చెప్పు అమ్మా, నేను డబ్బు దుబారాచేశానా? ఎందుకు అబద్ధాలాడతావు?" అని అరవాలనిపించేది రాఘవయ్యకు. కాని అరవడం కాదుకదా, కనీసం చెప్పలేక పోయేవాడు. కొంతకాలానికి ఆ మాటలన్నీ భరించడం నేర్చుకున్నాడు. అతని కొక్కటే కోరిక మాత్రం మనసులో ఉండేది. 'తను పోయిన తరవాతనైనా, ఈ సంసారానికి ఏదో ఉపాధి దొరికితే చాలు! 'అది ఎలా దొరుకుతుందా!' అని ఆలోచించేవాడు.

ఆ తరవాత రోజులు ఎలా గడిచాయో, భగవంతుడికే ఎరుక. రాఘవయ్య మంచంలో ప్రాణాంతకమైన యాతన పడ్డాడు. ఇంట్లోంచి ఒక్కొక్క సామానే మాయమవుతూండడం చూసి, గుడ్ల నీళ్ల కుక్కుకోవడం మినహా మరేమీ చెయ్యలేకపోయాడు. జానకమ్మ మంచం పక్కనే కూర్చుని పరిచర్యలు చెయ్యసాగింది. ఆమె ముఖం చూసినప్పుడల్లా, రాఘవయ్య గుండె తరుక్కుపోయేది. నిస్సహాయస్థితిలో ఉన్న అతను ఎంత బాధపడితేమాత్రం ఏం చెయ్యగలడు? శారీరక బాధల దృష్ట్యా, తనకి చివరి రోజులు సమీపించాయని మాత్రం గ్రహించగలిగాడు. విముక్తికోసం ఎదురు చూడసాగాడు.

ఆ తరవాత, తరవాత రాఘవయ్యలో దైవభక్తి ఎక్కువ కాసాగింది. మంచాని కెదురుగా దేవునిపటం పెట్టుకున్నాడు. రోజూ, ఆ భగవంతుణ్ణి ధ్యానించేవాడు.

"దేవుడా! నీ కందరూ ఒకటేకదా! పంతులుగారు చేసిన పుణ్యమేమిటి? నేను చేసిన పాపమేమిటి? వాళ్ల సంసారాన్ని గట్టెక్కించినట్టే, నా సంసారాన్ని కూడా గట్టెక్కించు. నేను పోయిన తరవాత వాళ్లని నిర్భాగ్యుల్నిగా చెయ్యకు ఏదో ఆధారం చూపించు." కాని వాళ్లకే ఆధారం దొరుకుతుందో, ఇతమిత్థమని రాఘవయ్య తేల్చుకోలేకపోయాడు.

తనకు దేవుడు తప్పక మేలుచేస్తాడని, ఎందుకో రాఘవయ్యకు అప్పుడప్పుడు నమ్మకం కలిగేది. ఆ నమ్మకం ప్రభావం వల్ల కొంచెం కోలుకునేవాడు. అప్పుడతన్ని చూసి జానకమ్మ సంతోషించేది. కాని ఆ తరవాత మళ్లీ దేవుడిమీద అతనికి అపనమ్మకం కలిగేది. ఎటువైపుచూసినా అంధకారమే కనిపించేది. రాను రాను ఇంట్లో పరిస్థితులు జటిలమవడంచూసి అతనికి చెప్పలేనంత నిస్పృహ ఆవరించేది. దేవుడు, తనకు అన్యాయం చేస్తాడేమోనని భయం ఎక్కువయి పోయింది రాఘవయ్యలో. ఈ నమ్మకం, అపనమ్మకాల మధ్య, ఆశ, నిరాశలమధ్య కొట్టుకుపోతున్నాడు రాఘవయ్య.




ఆ రోజు దీపావళి. పర్వదినం. ఊరంతా కొత్త వెలుగులు సంతరించుకుంటూంది. ఎవరి మొహంలో చూసినా సంతోషం తాండవిస్తూంది. ఇళ్లిల్లూ శోభాయమానంగా ఉన్నది. రాత్రి జరిగే, సంరంభాలకి సూచనలు అప్పుడే కనిపిస్తున్నాయి. ఊరంతా అలంకరించుకుంటూన్న వేళ. రాఘవయ్య ఇల్లు కళావిహీనంగా ఉండిపోయింది. అతనికి రాత్రినుంచీ స్మారకంలేదు. జానకమ్మకు నిద్రలేదు. అలానే కళ్లల్లో వత్తులు వేసుకుని మంచం పక్కనే కూర్చుంది. రాఘవయ్యకు కలవరింతలు ఎక్కువయ్యాయి. 'భగవంతుడా! నేను వెళ్లిపోతున్నాను. ఇంక ఈ కుటుంబానికి దారి చూపించవూ?' అంటాడు ఒకసారి. "పంతులుగారూ! మీరు అదృష్టవంతులు సుమండీ!" అంటాడు ఇంకొకసారి. "అమ్మాయి పెళ్లిచేసుకోదటే జానకీ!" అంటాడు మరొకసారి. ఈ మాటలన్ని విని జానకమ్మ కలవర పడసాగింది. తమకోసం, మనసులో విపరీతమైన బాధపడుతున్నాడని గ్రహించి జానకమ్మకళ్లు చెరువు లయ్యాయి. ఒక్కసారి తెలివివస్తే "మాకేం భయం లేదు! మా గురించి మీరు ఆదుర్దా పడకండి" అని చెబుతామని కూర్చుంది జానకమ్మ. కాని రాఘవయ్య కళ్లు తెరవటం లేదు.

సాయంకాలం తెలివి వచ్చింది రాఘవయ్యకు. చుట్టూ ఏవేవో శబ్దాలు వినపడుతున్నాయి. మంచం పక్కన కూచున్న జానకమ్మ ముందుకి వంగి, అతని ముఖంలోకి చూసింది. రాఘవయ్య నీరసంగా "ఆ చప్పుళ్లేమిటే జానకీ?" అన్నాడు.

"ఈ రోజు దీపావళి" అంది రుద్ధకంఠంతో జానకమ్మ. రాఘవయ్య మొహంలో శుష్క దరహాసం వెలిసింది. మరుక్షణంలోనే నల్లటి మబ్బు కమ్ముకుంది.

"అదేమిటే మనకు లేదూ దీపావళి? ఇల్లింత చీకటిగా ఉందేం! కొంచెం ప్రమిదెల్లో దీపాలూ అవీ వెలిగించండి. కనీసం వీధిలోనైనా దీపం పెట్టండే!" అని "పిల్లలేరీ" అన్నాడు.

"అరుగో బయటఉన్నారు" అని జానకమ్మ పిల్లల్ని లోపలికి పిలిచింది. అందరి ముఖాల్లోనూ, దైన్యం గూడుకట్టుకున్నట్టుంది. రాఘవయ్య మనసులో మళ్లీ చీకటి వ్యాపించింది. "బాబూ! ఈ దీపావళికి, మీకేమి కొనిపెట్టలేకపోయాను. వచ్చే దీపావళి మనం బాగా చేసుకుందాం ఏం!" అని నవ్వడానికి ప్రయత్నించేడు. కాని సాధ్యపడలేదు. కళ్లనీళ్లు తిరిగాయి.

"బాగుంది! ఇప్పుడీస్థితిలో వాళ్లకి వేడుకలు తక్కువచ్చాయా ఏమిటి?" మీరు మాట్లాడకుండా విశ్రాంతి తీసుకోండి. మీరేమైనా తాగుతారేమో చెప్పండి తీసుకువస్తాను" అంది జానకమ్మ.

"నేనేమీ తాగనుగాని జానకీ! ఇంత చీకటిలో భయంవేస్తూంది నాకు. కాస్త ప్రమిదెల్లో వత్తులు వేసి దీపాలు పెట్టండి" అన్నాడు. ఆ తరవాత రాఘవయ్య మళ్లీ ఏదేదో మాట్లాడటం మొదలెట్టాడు.

"సరేలెండి, వెలిగిస్తాను" జానకమ్మ లేచి, కళ్లు తుడుచుకుంటూ లోపలికి వెళ్లింది. లోపలికి వెళ్లిన జానకమ్మకి నూనె నిండుకుందన్న సంగతి పాత్ర చూస్తేనే కాని తెలియలేదు. అందులో చమురు ఒక్క దీపానికి సరిపడా ఉంది. జానకమ్మ మనసు వ్యథపడింది. ఆయన కోరిక ఒక్క కోరికనూ తీర్చలేని తన అసమర్థతను తలుచుకుని కొంగు నోట్లో కుక్కుకుని ఏడిచింది. తరవాత మూలనున్న మట్టి ప్రమిదెలో ఉన్న చమురుపోసి, వీధిలోకి వచ్చి ప్రమిదెను ముగ్గులో మధ్యగా పెట్టి, అగ్గిపుల్లగీసి ఆ ప్రమిదలోని వత్తి వెలిగించింది.

చమురునందుకున్న ప్రమిదెలోని వత్తి కాంతి పుంజాలు విరజిమ్మి మసకచీకట్లు పారద్రోలడానికి ప్రయత్నిస్తూంది. లోపలికి వెళ్లిపోదామని లేచిన జానకమ్మ, తనకు అతి దగ్గరలో, ఎవరో సూటూ, బూటూ వేసుకున్న యువకుడు చేతిలో నిండా పాకెట్లతో నిలుచోవడం చూసి ఉలిక్కిపడింది. ఆ యువకుడు ఇంకొంచెం దగ్గరగా వచ్చి "అమ్మా" అన్నాడు ఆప్యాయంగా. పిలుపు గుర్తించిన జానకమ్మ హృదయంలో వెయ్యి జ్యోత్స్నలు వెలిగాయి. కాని, గట్టిగా వీచిన గాలి విసురుకి ప్రమిదెలో ఆమె వెలిగించిన దీపం మట్టుకు ఆరిపోయింది! ★